నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
3 | కరీంనగర్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | RAJANNA SIRCILLA

ఆర్జీ-2లో గనులపై నల్లబ్యాడ్జీలు ధరిస్తున్న కార్మికులు

లాభాల వాటాలో కోతపై ఆగ్రహం

- గనులపై నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

గోదావరిఖని, సెప్టెంబర్ 23: సింగరేణి సంస్థ లాభాల వాటాలో కోత పెట్టడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఇచ్చిన నిరసన పిలుపు మేరకు సోమవారం గోదావరిఖనిలోని సింగరేణి ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆర్జీ-1లోని జీడీకే 1, 2, 2ఏ, 1 సీఎస్పీ, 11గని, ఓసీపీ 5, సివిల్ డిపార్ట్మెంట్, వర్క్‌షాప్, రీజినల్ అనలైటికల్ ల్యాబ్, జీఎం కార్యాలయం, ఆర్జీ-2 పరిధిలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్లపై, ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1, సైటాఫీస్, ఓసీపీ-1 బేస్ వర్క్‌షాపు, ప్రాజెక్టు కార్యాలయాల్లో టీబీజీకేఎస్ ఆర్జీ-1, 2, 3 ఏరియాల ఉపాధ్యక్షులు వడ్డెపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు.

మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డబుల్ బెడ్రూం కాలనీవాసులు

పది రోజులుగా తాగునీళ్లస్తలేవ్

గంభీరావుపేటలో డబుల్ బెడ్రూం కాలనీవాసుల ధర్నా

గంభీరావుపేట, సెప్టెంబర్ 23 : పది రోజులుగా తాగునీళ్లు రావడం లేదని.. తాము పడుతున్న కష్టాలు తీర్చాలని సోమవారం గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్రూం కాలనీవాసులు ధర్నా చేశారు. మండల కేంద్రంలోని బీసీకాలనీ డబుల్ బెడ్రూం సముదాయంలో 168 కుటుంబాలు ఉన్నాయని, పది రోజులుగా కాలనీలో తాగునీరు రావడం లేదని అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. మండల పరిషత్ కార్యాలయానికి తరలివచ్చారు. తక్షణమే అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు.

దవాఖానల పరిశీలనకు వెళ్తే

అరెస్టులా?

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, సెప్టెంబర్ 23: రాష్ట్రంలోని దవాఖానల పరిస్థితిపై అధ్యయనం చేసేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం హౌస్ అరెస్ట్ చేయడం దురదృష్టకరమని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యారోగ్య వ్యవస్థ దిగజారిందని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దవాఖానల పరిస్థితిపై అధ్యయనానికి మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మా జీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో బీఆర్ఎస్ అధిష్టానం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. నిజానిర్ధారణకు వెళ్లేందుకు సిద్ధమైన కమిటీ సభ్యులను హౌస్ అరెస్ట్ చేయడమంటే వాస్తవాలు దాచడమేనన్నారు. కమిటీ పర్యటిస్తే ప్రభుత్వానికి ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఎలాంటి దాపరికం లేకపోతే త్రిసభ్య కమిటీ దర్యాప్తునకు సహకరించాలని డిమాండ్ చేశారు. నిపుణులైన డాక్టర్ల బృందం, గాంధీ దవాఖానకు వెళ్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందో అర్థం కావడంలేదన్నారు. గాంధీ దవాఖానలో తమ పార్టీ ప్రస్తావించిన మాతా శిశు మరణాల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దాచిపెడుతుందా..? లేదా వారి పరిపాలన వైఫల్యం బయటకు వస్తుందోనని భయపడుతున్నదా..? అని ప్రశ్నించారు. కమిటీ నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికే నివేదిస్తుందని, తద్వారా సమస్యలు పరిష్కారం చేయవచ్చునే సోయి ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులు

కొత్తపల్లి, సెప్టెంబర్ 23 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి వరంగల్‌లో జరుగనున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టును సోమవారం ఎంపిక చేశారు. పలు ప్రాంతాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరుకాగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన 18 మందిని ఎంపిక చేసినట్లు కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు పీ మనోహర్‌రావు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో ఇ తక్షిల్, టీ రిత్విక్, బీ విగ్నేష్, సయ్యద్ అక్రం, ఎండీ కమ్రాన్, జీ రేనేశ్వర్, ఎం వంశీ, జీ శ్రీకాంత్, ఎండీ అర్షద్, ఎన్ సిద్ధార్థ, ఎండీ అఫ్రిది, జీ అన్వేష్, ఎస్ సార్థక్, బీ వినోద్, అత్యున్నత్ ఆనంద్, టీ విష్ణువర్ధన్, పీ ఆదిత్య, డీ వేణు ఉన్నారు.

'దళిత బంధు'పై నిర్బంధం

ఖాకీ నీడలో హుజూరాబాద్ దళితులు

- రెండో విడుత కోసం అడిగితే బెదిరింపులు
- నియోజకవర్గానికి ఎవరొచ్చినా ఆంక్షలు.. కేసులు
- తాజాగా నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు అరెస్టులు
- చింతకానికి ఇచ్చినట్టే తమకు ఇవ్వాలంటున్న లబ్ధిదారులు

నినదిస్తున్న దళితబంధు లబ్ధిదారులు (ఫైల్)

దళితబంధు లబ్ధిదారులపై పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నాయి. హుజూరాబాద్ నియోజకవర్గానికి ప్రభుత్వ పెద్దలు వచ్చినా.. కాంగ్రెస్ ముఖ్యులు వచ్చినా దళితబంధు లబ్ధిదారులను నిర్బంధిస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని అడిగితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. తమకు రావాల్సిన రెండో విడుత ఆర్థికసాయం కోసం ప్రభుత్వాన్ని అడగడమే వీరి పాలిట శాపంగా మారింది. ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలిపే అవకాశం కూడా ఇవ్వకుండా ఉక్కుపాదంతో అణచివేసే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలుసార్లు నిరసనలు తెలిపిన దళితులపై ఇప్పటికే పలు కేసులు బనాయించిన పోలీసులు, తాజాగా సోమవారం నియోజకవర్గంలోని నాలుగు పోలీసు స్టేషన్ల పరిధిలో ముందస్తుగా అరెస్టులు చేసిన ఘటనలు దళిత వర్గాల్లో కలకలం రేపుతున్నది.

కరీంనగర్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ)/ వీణవంక : దళితులను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లి సామాజిక అంతరాలను తొలగించాలనే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. వారికి ఇష్టమైన వ్యాపారాలు, ఇతర వృత్తుల్లో స్థిరపడేలా ప్రోత్సహించింది. రాష్ట్రంలోనే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 18,021 దళిత కుంటుంబాలను గుర్తించింది. బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, ఒక్కొక్కరి ఖాతాల్లో ₹10 లక్షల చొప్పున జమ చేసింది. ₹10 వేలు దళిత సంక్షేమ నిధికి పోను లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్లను బట్టి ₹9.90 లక్షల నుంచి ₹5 లక్షలు అంతకంటే ఎక్కువ మొత్తంలో విడుదల చేసింది. గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల నాటికి రెండో విడుత కింద నిధుల విడుదల ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో నోటిఫికేషన్ రావడంతో నిలిచి పోయింది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో 6,868 మందికి సంబంధించిన ₹256.76 కోట్లు, హన్మకొండ జిల్లా పరిధిలోని కమలాపూర్‌లో 1,280 మందికి ₹14.83 కోట్ల చొప్పున మొత్తం 8,148 మంది లబ్ధిదారులకు ₹271.60 కోట్లు రెండో విడుత కింద చెల్లించాల్సి ఉంది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ ఖాతాలపై ఫ్రీజింగ్ విధించడంతో పది నెలలుగా ఒక్క పైసా విడిపించుకునే అవకాశం లేకుండా పోయింది.

వీణవంక పోలీస్ స్టేషన్ ఆవరణలో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

ఆందోళనలకు దిగితే నిర్బంధాలు

తమకు రావాల్సిన దళితబంధు ఆర్థికసాయం ఇవ్వాలని హుజూరాబాద్ దళితులు అనునిత్యం శాంతియుతంగా పోరాటాలు చేస్తున్నారు. దళితుల సొమ్ము దళితులకే ఇవ్వాల్సిన ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దింపి ఎక్కడికక్కడ అణచివేసే ప్రయత్నం చేస్తున్నది. దళితబంధు సాధన సమితి పేరిట లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న వేదికపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడ ఆందోళన జరిగినా అక్కడికి వెళ్లి అరెస్టులు చేస్తున్నారు. ఫిబ్రవరిలో కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన దళితుల్లో ఐదుగురిపై వన్‌టౌన్ పోలీసులు కేసులు పెట్టారు. హుజూరాబాద్‌లో రాస్తారోకో చేసినందుకు మరో ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇవి కాకుండా దళితబంధు సాధన సమితిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న లబ్ధిదారులపై దృష్టి పెట్టి, వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 6న దళితబంధు సాధన సమితి శాంతియుతంగా ఆందోళన చేసేందుకు నిర్ణయించుకున్న కార్యాచరణ పోలీసులకు చిక్కింది. ఈ డేట్స్ రాగానే క్రియాశీలకంగా ఉంటున్న లబ్ధిదారులను ముందుగానే అరెస్టు చేసి స్టేషన్లకు తరలిస్తున్నారు. రాత్రంగా నిర్బంధిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో ఇప్పుడు ఏ దళితబంధు లబ్ధిదారుడిని ఎప్పుడు నిర్బంధిస్తారోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతున్నది. పోలీసుల నిర్బంధానికి వెరచిన దళితులు తమ కార్యాచరణ రద్దు చేసుకున్నట్లు ప్రకటించినప్పటికీ పోలీసులు తమ తీరు మార్చుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అంతెందుకు నియోజకవర్గంలో మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు ఎవరు పర్యటించినా ఇప్పుడు దళిత బంధు లబ్ధిదారులను పోలీసు స్టేషన్లలో నిర్బంధిస్తున్నారు. దళిత బంధు సాధన సమితిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ముఖ్యుల్లో కొందరిని ఇప్పటి వరకు 15 సార్లు అరెస్టు చేసినట్లు ఒక లబ్ధిదారుడు తెలిపారు.

తాజా అరెస్టులతో మరింత ఆందోళన

పోలీసులు తమపై ఆంక్షలు విధిస్తున్నారని వాపోతున్న హుజూరాబాద్ దళితులు తాజా పరిణామాలతో మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని కార్యాచరణలో నిర్ణయించుకున్న దళితులను ప్రతి ఆదివారం రాత్రి అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధిస్తున్నట్లు తెలుస్తున్నది. తాజా, పరిణామాల ప్రకారం ఈ నెల 23న సోమవారం డిప్యూటీ సీఎంను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లాలని కార్యాచరణలో నిర్ణయించుకున్నారు. ఆయన అందుబాటులో లేక పోవడంతో దళితులు కరీంనగర్ కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు వినతి పత్రం ఇవ్వాలనుకున్నారు. కానీ, ఆదివారం రాత్రి నుంచే దళితులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధించారు. ఈ పరిణామాలు హుజూరాబాద్ దళితవర్గాల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. నియోజకవర్గానికి ఎవరు వచ్చినా తమను పోలీసులు అరెస్టు చేస్తున్నారని, ఎక్కడైనా శాంతియుతంగా ఆందోళన చేసేందుకు ప్రయత్నించినా ముందుగానే నిర్బంధిస్తున్నారని దళితులు వాపోతున్నారు. ఆదివారం రాత్రి వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట మండలాల లబ్ధిదారులను ముందస్తుగా అరెస్టు చేసి సోమవారం మధ్యాహ్నం వదిపెట్టినట్లు దళితబంధు సాధన సమితి సభ్యులు కొలుపూరి నరేశ్, దాసారపు నాగరాజు వాపోయారు.

చింతకానికి ఇచ్చినట్లే మాకూ ఇవ్వండి

దళితబంధు హుజూరాబాద్‌లో పైలెట్‌గా అమలు చేశారు. ఇక్కడ చాలా మంది లబ్ధిదారులు ఇబ్బందుల్లో ఉన్నారు. ఖమ్మం జిల్లా చింతకానిలో మాత్రం దళితబంధు రెండో విడుత ఆర్థిక సహాయం అందించి మాకు మాత్రం ఎందుకు ఇవ్వడం లేదు. మేం దళితులం కాదా.. మాకు దళిత బంధు మంజూరు కాలేదా..? మేం ఎవరికీ వ్యతిరేకం కాదు.. ఎవరికీ అనుకూలం కాదు. మా బతుకేందో మేం బతుకుతామని చెబుతున్నం. మంత్రులను కలిసినా, అధికారులను కలిసినా మా పరిస్థితిని ఎవరు పట్టించుకోవడం లేదు. చింతకానిలో ఇచ్చినట్లే మాకూ ఇవ్వాలని అడుగుతున్నం. మరి మాకెందుకు ఇవ్వడం లేదు. చాలా మంది దళితుల పరిస్థితి దయనీయంగా ఉంది. దయచేసి మమ్మల్ని అర్థం చేసుకుని మా ఖాతాల్లో ఉన్న డబ్బులు తీసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వ పెద్దలను వేడుకుంటున్నం. మేము దొంగలం కాదు, దేశద్రోహులం కాదు, మమ్మల్ని ఎందుకు అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధిస్తున్నరు. మేం చేసిన తప్పేమున్నది. న్యాయంగా మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వమనే కదా అడుగుతున్నం.

- దాసారపు నాగరాజు, లబ్ధిదారుడు (వీణవంక)

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ వినోద్, నాయకులు

హామీలు నెరవేర్చకుంటే..

గ్రామాల్లో తిరగనియ్యం

- షరతుల్లేకుండా రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలి
- ఇప్పటివరకు రుణమాఫీ ఎంత చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలి
- రెండోవిడుత దళిత బంధు నిధులు మంజూరు చేయాలి
- దళిత కుటుంబాలపై స్వార్థ రాజకీయాలు చేయవద్దు
- దళిత సోదరులతో త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
- విలేకరుల సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, సెప్టెంబర్23: 'మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది. షరుతుల్లేకుండా ఏకకాలంలో ₹2లక్షల రుణమాఫీ చేయాలి. రైతుభరోసా ఎకరాకు ₹7,500ఇవ్వాలి. ఇప్పటివరకు ఎంత రుణమాఫీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చకుంటే సీఎంతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులను గ్రామాల్లో తిరగనియ్యం' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ, రైతుబంధు సమయానికి అందించిన ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులను విస్మరించడం దుర్మార్గమన్నారు. బడ్జెట్‌లో రుణమాఫీకి ₹26వేల కోట్లు ప్రవేశపెట్టారని, మాఫీ చేసింది ₹17.9వేల కోట్లు మాత్రమేనని ఆరోపించారు. ₹49వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం, ఇప్పుడు 60శాతం కూడా మాఫీ చేయలేదన్నారు. షరతుల్లేకుండా అందరికీ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దళితుల అభ్యున్నతి కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఫైలెట్ ప్రాజెక్టుగా దళితబంధు ప్రవేశపెట్టి.. 18వేల కుటుంబాలకు పథకాన్ని అమలు చేశారన్నారు. కాంగ్రెస్ సర్కారు రెండోవిడుతలో మరో 5వేల కుటుంబాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాతాల్లో ఉన్న నిధులు ఎందుకు రిలీజ్ చేయడం లేదో చెప్పాలన్నారు. దళిత కుటుంబాలపై స్వార్థ రాజకీయాలు చేయవద్దని హితవుపలికారు. దళిత సోదరులతో త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనవసర స్టేట్‌మెంట్లు ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, సంపత్, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రావు, తిరుపతిరెడ్డి, వెంకటేశ్, నవీన్, రాజ్‌కుమార్, సాదవరెడ్డి, భాస్కర్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను తిప్పికొడతాం

కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే దిక్సూచి. అలాంటి ప్రాజెక్టుపై కనీసం అవగాహన లేకుండా సీఎం, మంత్రులు మాట్లాడుతున్నరు. రూ.లక్ష కోట్లు వృథా చేశారని, పైసలన్నీ గోదావరిలో పోశారని ఆరోపిస్తున్నరు. ప్రకృతి విపత్తుతో మేడిగడ్డకు చెందిన మూడు పిల్లర్లు కుంగితే రాద్ధాంతం చేస్తున్నరు. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోవాలని దుర్మార్గంగా ఆలోచిస్తున్నరు. కాళేశ్వరమంటే ఒక్క మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలే కాదు, వేల కిలోమీటర్ల సొరంగాలు, కాలువలు, ఎత్తిపోతలు, లిఫ్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు. తెలంగాణ రైతాంగానికి భవిష్యత్ అందించినం. రాబోయే రోజుల్లో సోలార్ ప్యానళ్లతో కాళేశ్వరం సాగుతుంది. ఇదీ కేసీఆర్ విజన్. కాళేశ్వరం గురించి తెలియాల్సిన ప్రాథమిక సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొడతాం. రాజకీయాలు మానుకొని రైతాంగానికి పంటలు ఎండిపోకుండా నీరందించే చర్యలు చేపట్టాలి.

- బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు

మా ఇండ్లు మాకివ్వండి

- కలెక్టర్ సారు స్పందించండి.. మాకు న్యాయం చేయండి
- డబుల్ బెడ్రూం లబ్ధిదారులు
- నెల రోజుల్లో పంపిణీ చేస్తామన్న కలెక్టర్

పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రామగుండం నియోజకవర్గ డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

పెద్దపల్లి, సెప్టెంబర్23: 'మా ఇండ్లు మాకు ఇవ్వండి. కలెక్టర్ సారూ మా గోడు వినండి. సత్వరమే మాకు న్యాయం చేయండి' అంటూ రామగుండం నియోజకవర్గంలోని డబుల్ బెడ్రూం లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు వేడుకున్నారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, దినసరి కూలీగా పనులు చేసుకుంటూ బతుకు వెల్లదీస్తున్నామని, ఏండ్ల తరబడి అద్దె ఇండ్లలో ఉంటూ కిరాయిలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించారని, కానీ రామగుండంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జంగల్లపల్లి ఎన్టీపీసీలో 660 డబుల్ బ్రెడూం ఇండ్ల నిర్మాణాలు చేపట్టి, లబ్ధిదారులను ఎంపిక చేసిందని గుర్తు చేశారు. డ్రా ద్వారా ఎంపికైన తమకు ఇండ్లు సత్వరమే మంజూరు చేయించి, పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్ష లబ్ధిదారులతో మాట్లాడారు. రామగుండం నియోజక వర్గంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ గురించి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, చిన్నచిన్న పనులు మిగిలి ఉండడంతో ఆలస్యం అవుతున్నదని చెప్పారు. నెల రోజుల్లో పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తామని, అప్పటి దాకా ఒపిక పట్టాలని సూచించారు. ఆందోళనలో లబ్ధిదారులు అశోక్, శంకర్, ఎం దేవేందర్, ఎం రమేశ్, ఎం సుజాత, సంపత్, ఈ శ్రీనివాస్, చోటి బేగం, బానోత్ లక్ష్మి, మహేందర్, మాధవి, చాయ, ఎం సుజాత, ఏ అనురాధ, గోపి, హుస్సేన్, రాజేశ్ ఉన్నారు.

ఇది ప్రజలను వంచించే ప్రభుత్వం

- రాజకీయ నేతల ప్రోద్బలంతోనే నియామకాలు
- సిరిసిల్ల రేషన్‌డీలర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాదని.. ప్రజలను వంచించే ప్రభుత్వమని రేషన్‌డీలర్లు ధ్వజమెత్తారు. రేషన్‌షాపుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా.. రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే నియామకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లాలోని రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిరిసిల్ల డివిజన్‌లోని 58 రేషన్‌షాపుల్లో డీలర్ల భర్తీ కోసం ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసి, పరీక్ష నిర్వహించిందన్నారు. అయితే రిజల్ట్ మెరిట్ లిస్ట్ జాబితా విడుదల చేయకుండానే కొందరిని మాత్రమే ఇంటర్వ్యూలకు పిలుస్తోందన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, అప్పటివరకు నియామక ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పొన్నాల శ్రీనివాస్, చింతలపల్లి రాజిరెడ్డి, పుణ్‌నాయక్, దేవదాస్, రవీందర్‌రావు, పుల్లూరి లత తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రేషన్‌డీలర్లు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

కష్టపడిన వారికి గుర్తింపులేదు

కేకే మహేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 23: 'కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు దక్కడం లేదు. ప్రలోభాలకు గురిచేసిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నరు. వెంటనే వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రద్దు చేయాలి' అని గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గంభీరావుపేట మండలంలో ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం తాము పని చేస్తున్నామని, పదవుల కేటాయింపునకు వచ్చేసరికి తమకు కనీస సమాచారం ఇవ్వలేదని వాపోయారు. ఇటీవల ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన నామినేటెడ్ పదవుల ఎంపికలో సీనియర్ నాయకులను కాదని పార్టీలో కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఇంట్లో కూర్చొని కొంత మంది సూచనలు తీసుకుని మాత్రమే అధిష్టానానికి నామినేటెడ్ పదవుల జాబితాను పంపారని ఆరోపించారు. సీనియర్ నా యకులకు పదవులు ఇవ్వని పక్షంలో పార్టీ మా రేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధిష్టానం సానుకూలంగా ఉన్నప్పటికీ.. కేకే మహేందర్‌రెడ్డి కొంత ప్రలోభాలకు గురై తమకు అన్యాయం చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నిమ్మల తిరుపతిగౌడ్, ఓరుగంటి నర్సింహులు, చత్రబోయిన బాలయ్య, చీకోటి నర్సయ్య, మిద్దె సత్యం, ఎడబోయిన రాజు, పిట్ల నర్సింహులు, బత్తిని నర్సింహులు, ద్యానబోయిన బాలకిషన్, పెద్దిగారి శ్రీనివాస్, పెరుమళ్ల రాజశేఖర్, ఒడిసెలా బాలయ్య, లచ్చగారి నరేశ్ పాల్గొన్నారు.